నేడు, రేపు నగరంలో ప్రధాని పర్యటన

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ) :మంగళ, బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ నగరంలో పర్యటించనుండడంతో ఆయా రూట్లలో నిర్ణీత సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ వెల్లడించారు.

- బుధవారం సాయంత్రం 7:50 నుంచి 8:25గంటల వరకు బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి బేగంపేట్ పబ్లిక్ స్కూల్, గ్రీన్ ల్యాండ్స్, మొనప్ప జంక్షన్ నుంచి రాజ్‌భవన్ వరకు ఆంక్షలు ఉంటాయి.
- గురువారం ఉదయం 8:35 నుంచి 9:10 నిమిషాల వరకు రాజ్‌భవన్ నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్టు వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి.

రాగల 36గంటల్లో.. గ్రేటర్‌కు వర్ష సూచన

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 36గంటల్లో గ్రేటర్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ మేరకు గ్రేటర్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు 0.9 డిగ్రీలు తగ్గి 41.9 డిగ్రీల సెల్సియస్ గాను, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28.1డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 26శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

అసోంలో జియోథర్మల్ వనరులపై ఎన్జీఆర్ఐ అన్వేషణ

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ) : చమురు నిల్వలకు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణపై ఎన్జీఆర్ఐ దృష్టి సారించింది. ఆయిల్ ఇండియా లిమిటెడ్, సెంటర్ ఫర్ ఎర్త్ సైన్సెస్ అండ్ హిమాలయన్ స్టడీస్ అధ్వర్యంలో అరుణాచల్ ప్రదేశ్, అసోం ప్రాంతాల్లో ఉన్న ఆయిల్ బావులను అన్వేషించనున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఎన్జీఆర్ఐ ఎంటీ (మ్యాగ్నెటోటెలోరిక్స్) సర్వే నిర్వహించి జియోథర్మల్ సైట్లను పరిశోధిస్తున్నది. చమురు నిల్వలను బట్టి డ్రిల్లింగ్ చేసేందుకు సాయపడుతుందని చెబుతున్నారు. 2030 నాటికి దేశంలో 10మెగా వాట్ల జియోథర్మల్ శక్తి వనరులను వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్రం ఉంది. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల్లో 100కు పైగా ప్రాంతాలను అన్వేషిస్తున్నట్లుగా తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మే 6 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీ సీఏ) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఈ కోర్సుల మొదటి నుంచి 5వ సెమిస్టర్ వరకు బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

అన్ని వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే

భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

పాదయాత్రకు బ్రహ్మరథం పట్టిన నాంపల్లి ప్రజలు



నాంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు,నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్‌లతో కలిసి ప్రచారం చేస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి టి పద్మారావు గౌడ్.

అబిడ్స్, మే 6 : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తున్నదని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో సికింద్రాబాద్ నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి పద్మారావు గౌడ్ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని పలు ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఇక్కడ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, అదే విధంగా చేసిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్నారన్నారు. నాంపల్లి నియోజకవర్గం ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వెన్నంటి ఉన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని, నాంపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు భారీ మెజార్టీ లభించడం ఖాయమన్నారు. నాంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పర్యటించిన పద్మారావు గౌడ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మచ్చలేని నాయకుడిగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే పద్మారావును గెలిపించుకునేందుకు ప్రజలు సంసిద్ధులై ఆయన పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్లు ఉంటదా.?

సమావేశంలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్, తదితరులు

- సంక్షేమం అంటే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటేనే సంక్షేమం
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఇక్కడ ఓటు హక్కే లేదు
- రాజకీయ పునరావాసం కోసం మల్కాజిగిరిలో పోటీ
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, ఎంపీ అభ్యర్థి రాగిడి

దుండిగల్, మే 6 : కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల అమలుకు గ్యారెంటీ లేదని, అసలు ఐదేండ్లు ఈ ప్రభుత్వం ఉంటుందనడానికి గ్యారెంటీ సైతం లేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు అసలు ఇక్కడ ఓటు హక్కే లేదని వీరు రాజకీయ పునరావాసం కోసం మల్కాజిగిరిలో పోటీ చేస్తున్నారు తప్ప ప్రజా సంక్షేమం కోసం కాదని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధి, షాపూర్‌నగర్‌లోని ఎం.జే గార్డెన్స్‌లో నిర్వహించిన ముస్లిం మైనార్టీ సోదరుల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో షాదీముబారక్ పథకంలో ముస్లిం యువతుల వివాహాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు విదేశీ విద్య వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థులు పార్లమెంట్‌లో 12మంది ఉంటే మన హక్కులు, మనకు రావాల్సిన బడ్జెట్‌ను సాధించుకోలేమా..? అని ప్రశ్నించారు. జూన్ 2వ తేదీతో హైదరాబాద్ ఉమ్మడి రాజధానికి ముగింపు ఉంటుందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీలను గెలిపించుకుంటే ఇంకా ఎన్నికలు రాకుండా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలకు అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. నాయకులు సీహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఎన్.సత్యం, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స సులభం

కిమ్స్ సన్‌షైన్ దవాఖాన సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ కృపా బజాజ్

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మట్లాడుతున్న డాక్టర్ కృపా బజాజ్

హిమాయత్‌నగర్, మే 6 : క్యాన్సర్ వ్యాధిని ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స అందించడం సులభతరం అవుతుందని గచ్చిబౌలి కిమ్స్ సన్‌షైన్ దవాఖాన సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ కృపా బజాజ్ అన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండల వల్ల మనిషి శరీరంలో నీరు శాతం తగ్గుతుందని, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందన్నారు. సరైన నిద్రతో పాటు మంచి ఆహారం, మజ్జిగ, కొబ్బరి నీరు, జావ రూపంలో ఆహారం తీసుకోవాలన్నారు. కీమో థెరపీ, రెడియో థెరపీ తీసుకునే రోగులకు వేసవిలో వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉంటుందని, నూతన చికిత్స విధానాలతో క్యాన్సర్‌ను కట్టడి చేయవచ్చన్నారు. ఈ నెల 12న మదర్స్ డే సందర్భంగా రొమ్ము క్యాన్సర్, వేసవిలో రోగులు తీసుకోవాల్సిన పలు అంశాలపై అవగాహన కల్పించి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. 40 ఏండ్లు దాటినా మహిళలకు అండాశయం, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, సకాలంలో వైద్యులను సంప్రదించి క్యాన్సర్‌కు సంబంధించిన రక్త పరీక్షలు, స్కాన్ చేసుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రతినిధులు రసూలు, రంగస్వామి పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు తెలంగాణ బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బీసీ సర్వసభ్య సమావేశం.
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం.
- బషీర్‌బాగ్ దేశోద్ధారక్ భవన్‌లో ఉదయం 11 గంటలకు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ నాయకుల 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం.
- బేగంపేట్ తెలంగాణ టూరిజం ప్లాజా ప్రాణిహిత హాల్‌లో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో 'రాజ్యాంగ రక్షణ-రిజర్వేషన్ల పరిరక్షణ' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం.

ఆన్‌లైన్ ముఠాల ట్రేడింగ్ దోపిడీ

లాభాల ఆశచూపి ముగ్గులోకి లాగి

కోట్లు దోచుకుంటున్న సైబర్ ముఠాలు

నకిలీ కంపెనీల పేరుతో బ్యాంకు ఖాతాల సృష్టి	వందల కోట్లు దాటిన ఆన్‌లైన్ లావాదేవీలు

3 కేసుల్లో పలువురు నేరస్తుల పట్టివేత దేశవ్యాప్తంగా వందలాది కేసులతో సంబంధం

వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా నకిలీ ఖాతాలు తెరిచి సైబర్‌మోసాలకు పాల్పడుతున్న పలువురు నిందితులను సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను సోమవారం నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సైబర్ నేరస్తుల మాటల మాయలో పడి మంచి హోదాలో ఉన్న విద్యావంతులు కూడా లక్షల్లో డబ్బులు చేజార్చుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వేర్వేరు కేసుల వివరాలను మీడియాకు వెల్లడించారు.

ట్రేడింగ్ పేరుతో.. కోట్లు పోగొట్టుకున్నారు

దుబాయ్‌లో ఉంటూ విలాసవంతమైన జీవితం గడుపుతున్న బెర్లిన్ ఆరితేరిన సైబర్ నేరగాడు. అక్కడి నుంచే ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ మోసాలు చేస్తుంటాడు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన రాంచంద్ర నకిలీ కేవైసీలు, నకిలీ సంస్థల పేర్లను సృష్టించి దొంగ బ్యాంకు ఖాతాలు సృష్టించి ఆ వివరాలన్నింటినీ బూర రామ్ అనే వ్యక్తి ద్వారా దుబాయ్‌లోని బెర్లిన్‌కు చేరవేస్తుంటాడు. ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలొస్తాయని నమ్మించి పలువురిని టెలిగ్రామ్ యాప్ ద్వారా పెట్టుబడి పెట్టిస్తారు. ఇదంతా నిజమేనని నమ్మిన నగరవాసి ఒకరు దఫదఫాలుగా కోటి రూపాయలకు పైగా ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేశాడు. మోసపోయానని తెలుసుకున్న బాధితుడి ఫిర్యాదుతో ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్ నరేశ్ బృందం దర్యాప్తు చేపట్టింది. నిందితులను పట్టుకునేందుకు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే నేపాల్ నుంచి బూరరామ్ వస్తుండగా సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు దేశ వ్యాప్తంగా 507 కేసులతో సంబంధం ఉండగా.. తెలంగాణకు సంబంధించినవి 67 కేసులు ఉన్నాయి. నిందితుల వద్ద నుంచి రూ. 1.44 కోట్లు ఫ్రీజ్ చేశారు. అందులో రూ. 55 లక్షలు బాధితుడికి కోర్టు ద్వారా రిఫండ్ చేశారు. కాగా విదేశాల్లో ఉన్న బెర్లిన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు మరో సైబర్‌ముఠా తాము పాంథియెన్ వెంచర్ కంపెనీకి సంబంధించిన వాళ్లమని చెప్పి ఓ ట్రేడింగ్ యాప్ తయారు చేశారు. ప్రారంభంలో స్వల్ప లాభాలు చూపించి ఆకర్షించి ఆ తర్వాత దఫదఫాలుగా పెట్టుబడి పెట్టించారు. సైబర్‌నేరస్తుల వలలో చిక్కుకొని నగరానికి చెందిన ఓ విద్యావంతుడు కోటికి పైగా సమర్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీసీ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు బృందం దర్యాప్తు చేపట్టింది. అయితే సైబర్‌నేరస్తుల ట్రేడింగ్ లావాదేవీలకు అనుగుణంగా ఇండియా నుంచే కొంతమంది నకిలీ పేర్లతో బ్యాంకు ఖాతాలు సృష్టిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాజీ ఉద్యోగి అశితోస్ రాజ్ తన పాత పరిచయాలతో పలువురి సహకారంతో నకిలీ కంపెనీల పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచి ఇతర దేశాల్లో ఉన్న సైబర్‌నేరగాళ్లకు చేరవేస్తున్నారు. ఈ ముఠాలో పలువురిని అరెస్టు చేశారు. 170కి పైగా కేసులతో వీరికి సంబంధం ఉందని తేల్చారు. ఇలాగే... యుకైన్8. టాప్ పేరుతో వెబ్‌సైట్ తెరిచి ట్రేడింగ్ పేరుతో వందలాది మందిని మోసం చేసిన మరో ముఠాను కూడా హైదరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. 92 కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. దాదాపు 16 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. ఈ ముఠా నుంచి 1.68 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు సీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు శ్వేత, కవిత, రష్మిపెరుమాళ్, ఏసీపీ శివమారుతీ, సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

బీఆర్ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన

కంటోన్మెంట్‌లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రచారం

బొల్లారం, మే 6 : మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురడం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు బోయిన్‌పల్లి, బాపూజీ నగర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితతో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని అన్నారు. ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట పరిధి పీఆర్‌నగర్ పార్కులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట, మే 6 : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. సోమవారం మూసాపేట డివిజన్ పరిధి పీఆర్‌నగర్‌లోని పార్కులో ఎమ్మెల్యే కృష్ణారావు డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ ముఖ్య నాయకులతో కలిసి వాకర్స్‌తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని, కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలకు అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. నాయకులు సీహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఎన్.సత్యం, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ స్వార్థం కోసం.. పార్టీ మారిన వారికి బుద్ధి చెప్పాలి



కాలనీ వాసులతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , మే 6 : కాంగ్రెస్, బీజేపీల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ప్రజలకు అండగా ఉండే గులాబీ జెండాకు జై కొడుతున్నారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. రాజకీయ స్వార్థం కోసం పార్టీలు మారి ప్రత్యర్థులుగా బరిలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సోమవారం చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఆల్విన్ కాలనీ – 1 సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే గాంధీ హాజరై ప్రసంగించారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి కేసీఆర్ నేతృత్వంలో విశేష కృషి చేశారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. మాజీ కార్పొరేటర్ రంగారావుతో పాటు పార్టీ నేతలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో 4.25లక్షల రైతులు ఆత్మహత్య

బడా కంపెనీలకు కోట్లలో రుణ మాఫీ..

రైతులకు ఎందుకు చేయలే.?

రైతాంగ వ్యతిరేక బీజేపీని చిత్తుగా ఓడించండి

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ఖైరతాబాద్, మే 6 : రైతు వ్యతిరేఖ బీజేపీని చిత్తుగా ఓడించాలని సంయుక్తా కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం అఖిల భారత నాయకులు డాక్టర్ విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 4.25లక్షల మంది రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి కూలీలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వీటి నివారణకు కేంద్ర ప్రభుత్వం నిర్ధిష్టమైన నివారణ చర్యలు తీసుకోకపోగా, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టే ప్రయత్నం చేసిందన్నారు. కరోనా కాలంలో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 13నెలల పాటు సుధీర్ఘ పోరాటం జరిగిందని, 750 మంది రైతులు బలిదానాలు చేశారని, ఫలితంగా 2021 డిసెంబర్ 9న కేంద్రం ప్రభుత్వం దిగివచ్చి ఆ చట్టాలను ఉపసంహరించుకోవడంతో పాటు కనీస మద్దతు ధర చట్టం చేస్తామని, రుణ మాఫీ చేస్తామని, విద్యుత్ సవరణ బిల్లును రైతులతో మాట్లాడకుండా పార్లమెంట్‌లో పెట్టమని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామని, ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి ఉపయోగపడే విధంగా చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఆ హామీలన్నింటిని విస్మరించిందని తెలిపారు. బడా కంపెనీలకు రుణ మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతాంగం చేసిన అప్పులను మాత్రం మాఫీ చేయలేదన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా ప్రతినిధులు సుంకెట అన్వేష్ రెడ్డి, టి. సాగర్, విస్సా కిరణ్, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఆర్.వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో రౌడీషీటర్

నిర్వాహకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, మే 6 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఎన్నికల ప్రచారసభలో రౌడీషీటర్‌ను భాగస్వామ్యం చేసిన కాంగ్రెస్ నాయకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్ సీ-బ్లాక్ కమ్యూనిటీహాల్ సమీపంలో సభ నిర్వహించారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ నేత మహ్మద్ అజరుద్దీన్‌తో పాటు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న బిల్లా పవన్ స్టేజీ మీదకు ఎక్కాడు. రౌడీషీటర్లకు, సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులు ఎన్నికల సభలు, ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల నియమావళికి వ్యతిరేకమని, వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వల్ల ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యే అవకాశం ఉన్నదని నిబంధనలు ఉన్నాయి. ఈ మేరకు కృష్ణానగర్ ఎన్నికల సభకి అనుమతి తీసుకున్న కాంగ్రెస్ నాయకుడు కాలే రోహిత్‌ను బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ఐపీసీ 188 సెక్షన్‌తో పాటు సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.